# ఇలా జరిగేను!

అది రెండో సంవత్సరం....

గత సంవత్సరమంతా యశోధరుడు ఆపల్లెలోనే వుండి పార్టీ పని చేశాడు. రాత్రింబగళ్ళు నిద్రా నీళ్ళూ లేకుండా పనిచేశాడు. వ్యవసాయ కూలీలను గురించే బండెడు పుస్తకాలు చదివాడు. వాళ్ళల్లో చైతన్య రహితంగా పడివున్న శక్తిని గ్రహించాడు. వాళ్ళ హక్కులను తెలుసుకున్నాడు రైతులు వాళ్ళ నేవిధంగా పీడిస్తూవుందీ— అతని భాషలో రక్తం తాగటం.... అర్థం చేసుకున్నాడు. ఇవన్నీ వాళ్ళకి చెప్పాడు.

"పని చేసేది మీరు; ఫలితం అనుభవించేది వారు" అన్నాడు.

ఎవరా అని వ్యవసాయ కూలీలు అటూ ఇటూ చూశారు.

"రోజుకి గుప్పెడు మెతుకుల్లేకుండా మీరెంత కాలం ఇలా బ్రతుకుతారు?" అని ప్రశ్నించాడు. వ్యవసాయకూలీలు తమ తమ కుండలు సర్దుకున్నారు. ఆరబోసిన బెత్తల్నీ కుప్పలు కుప్పలుగా వున్న పీతల్నీ, వేలాడకట్టివున్న చీకుల్నీ చూచుకొని గుటకలు మింగారు.

"మీ శక్తి మీకు తెలియదు. మీరు ఏకంగా ఒక్క పెట్టున లేస్తే రాజ్యాలే మీ చేతుల్లోకి వస్తయ్" అన్నాడు యశోధరుడు.

వాళ్ళు ఒకళ్ళ చేతులు ఒకళ్ళు చూచుకున్నారు. ఎవరి చేతులు వాళ్ళు దులుపుకున్నారు.

ఈవిధంగా అతడు సంవత్సరం తంటాలుపడ్డాడు. సంవత్సరం తిరిగి వచ్చేటప్పటికి అతని కృషికి ఫలితాలు గోచరించినయ్. వ్యవసాయ కూలీల్లో విప్లవచిహ్నాలు రేకెత్తినయ్. ఎక్కడ చూచినా, కూలీలందరూ

'ఏకము కావలెరా' అనే కీర్తనే వినబడుతూ వుంది— ప్రతిదానికి యశోధరుని సలహా తీసుకోవటం. మొదలుపెట్టారు. క్షణ క్షణానికీ పల్లె అంతా మారిపోతున్నట్లు ఊహించుకున్నాడు. తనకృషి నేటికి ఫలించింది కదా అని సంతోషించాడు యశోధరుడు. ఈ వేడిలోనే జయం పొందాలను కున్నాడు. వ్యవసాయ కూలీలు 'సై' అన్నారు.

"పదండి పోదాం, పదండి ముందుకు" అన్నాడు వెంకయ్య. పల్లె పల్లె బిలబిలా బయల్దేరింది. పిల్లలు పెద్దలు అంతా బయల్దేరారు. షాహుకారు బసవయ్య ఇల్లు చుట్టు ముట్టారు.

షాహుకారు బసవయ్య—వెంకాయికి, ఆ వూళ్ళోరైతు లందర్లోకీ డబ్బున్నవాడు ఆ ఇంటి దగ్గరకు జేరినప్పటినుంచీ, మిగిలినవాళ్ళు కేకలు వేస్తున్నా వెంకయ్య కొంచెం బెరుగ్గా వుంటం మొదలుపెట్టాడు.

"తలుపు తలుపు" అని కేక వేసింది జనం!

కాని తలుపు అలాగే మూసుకొనివుంది. వ్యవసాయ కూలీలకు ఏం చెయ్యటానికీ తోచలేదు. అయిదు నిముషాలయింది-పదినిమిషాలయింది-పావుగంట అయింది. తలుపు అలాగే వుంది. వ్యవసాయ కూలీలు ముగ్గురు నలుగురు చొప్పున ఒక్కొక్కచోట జేరి కబుర్లు చెప్పుకోవటం మొదలుపెట్టారు.

"కామ్రేడ్స్!"

ఇంతలో తలుపు తెరుచుకుంది. బసవయ్య బయటకు వచ్చాడు. అతని వేలు పట్టుకొని మూడేళ్ళ కూతురొచ్చింది. భార్య అన్నపూర్ణ తలపువక్కనుంచి తొంగిచూస్తూవుంది.

ఉపన్యాసకుణ్ణి వొదిలి వ్యవసాయ కూలీలంతావొక్కసారి బసవయ్య వేపుకితిరిగారు. కూర్చున్న వాళ్ళంతా వొక్కసారి లేచి నిలబడ్డారు. తరువాత ఏం చెయ్యాలో తోచలేదు. అలాగే చూస్తూ నుంచున్నారు.

బసవయ్య మూడేళ్ళకూతురు గుంపులోవున్న వెంకాయిని గుర్తు

పటింది. సంతోషంగా "అలుగో, ఎంకు, ఎంకు, ఎంకు." అని ఖుర్లి చేతుల్తో చప్పట్లు కొడుతూ గంతులేసింది.

వెంకాయి సిగ్గుతో తలవంచుకొని, "మా చిన్నదొరసాని, మా చిన్నదొరసాని" అని పక్కనున్న వాళ్ళకి చెప్పాడు.

"వెంకా" అని పిలిచాడు బసవయ్య.

వెంకాయి పలిక్కపడ్డాడు. "వెళ్ళరా. పెద్దదొర పిలుస్తున్నాడు." అని అంతా వెంకాయిని ముందుకు నెట్టారు.

"ఏరా ఎంకా బాగున్నావా?" అన్నాడు బసవయ్య ఆ మాటలు వెంకాయి హృదయాన్ని కరిగించినయ్. ఎన్నడో విడిచిన తండ్రిని చూచి నట్లు ఆనందించాడు. ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ నిలబడ్డాడు.

"ఎందుకురా, ఇంతమందొచ్చారు? ఏమన్నా పనుందా!" అని అడిగాడు బసవయ్య.

"ఎం లేద్దొరా!" అని సణిగాడు వెంకాయ.

"చెప్పు దొరతో చెప్పుకోరా. మనవి చేసుకోరా" అని కొంతమంది కేకలు వేశారు

వెంకాయి, తప్పక ధైర్యంచేశాడు– "ఏం లేద్దొరా! మాకొకటి కావాలి"

"ఏమిటి చెప్పు?"

"నూతన వెవస్థ"

"ఏమిటి?"

"నూతన వెవస్థ దొరా"

బసవయ్య కొంచెంసేపు ఆలోచించాడు. కాని అర్థంకాలేదు "అది నా దగ్గరలేదు" అన్నాడు.

"చూడు దొరా" అని ప్రాధేయపట్టానికి రెండడుగులు ముందుకు వేశాడు వెంకాయి.

"దగ్గరలేదురా. పోయి మన జమీందారు దగ్గరుందేమో అడుగు" అన్నాడు బసవయ్య.

"అవును ఆయనగ్గరే దొరుకుతుంది. అక్కడే దొరుకుద్ది" అని మిగిలిన వాళ్ళు కేకలు వేశారు. యశోధరుడు ఉక్కిరిబిక్కిరైపోయాడు ఏం చెయ్యాలో బోధపడలేదు ఎలా జోక్యంకలిగించుకోవాలో తెలియదు. జోక్యంకలిగించు కుంటే ముందీ వ్యవసాయకూలీలు వూరుకుంటారా? అనే స్థితి కొచ్చింది.

వెంకాయి మళ్ళీ బసవయ్య నడిగాడు– "ఇంకొకటి దొరా!"

"ఏమిటి?"

"కూలీలంతా ఏకం కావాలి దొరా!"

"ఎందుకు?"

"కావాలి దొరా!"

"ఎందుకురా, కారణం చెప్పు!"

"కారణం ఏంటి దొరా! ఏకం కావాలి?"

"సరే అవ్వండి."

"అదేంటి దొరా, అలా సెలవిస్తావ్? దొరసాయం లేకుండా మేం ఎట్లా ఏకం అవుతాం?"

"సరే అట్లాగే అవ్వుదురుగాని,మరిమమ్మల్నేం చెయ్యమంటావు?" అన్నాడు బసవయ్య.

"మీరా....దొరలా....దొరలా...." అంటూ నసికాడు వెంకాయి.

"నిజమేరా, దొరల్ని ఒదిలి మనం ఎక్కడికి పోతాం–" అన్నారు కొందరు.

"నువ్వడిగింది బాగుంది దొరా!" అన్నాడు వెంకాయి.

"అందుకని మనం అంతా ఏకమవుదాం." అన్నాడొక వ్యవసాయ కూలీ.

"ఏకమవుదాం, ఏకమవుదాం!" అని మిగిలిన కూలీల్లోంచి కేకలు. వెంకాయి సంతోషం చెప్పటానికి వీల్లేదు. అమాంతంగా బసవయ్య మూడేళ్ళ కూతుర్ని ఎత్తుకొని....

"మా చిన్న దొరసాని
మా చిట్టి దొరసాని
మా బుల్లి దొరసాని
ఏకమవుదాం
ఏకమవుదాం
ఏకమవుదాం—" గంతులేశాడు.

"అంతా జమీందారు మీదకు పోదాం. నూతన వెవస్థ తెచ్చుకుందాం. దొరలుంటే మనకేం భయం" అని వ్యవసాయకూలీలంతా కేకలు!

"ఇక మీ పనుల్లోకి మీరు పొండి" అన్నాడు బసవయ్య. వెంకాయి తప్ప అంతాసంతోషంగా గుసగుస లాడుకుంటూ వెళ్ళారు.

"దొరంటే పెద్దదొరని చెప్పుకోవాల్రా" అన్నాడొకడు.

"కష్టసుఖాలు తెలిసిన మారాజు" అన్నాడు మరొకడు.

'అడిగినవన్నీ చెప్పుకున్నాడురా" అన్నాడు మరొకడు.

అన్నపూర్ణమ్మ అప్పుడు బయటకువచ్చి, "వెంకా! వెళ్ళే ముందు గేదెముందు ఇంత గడ్డివేసి పో! మజ్జిగవున్నయ్ పోయించుకుపో" అంది.

"అట్లాగే దొరసానమ్మా" అని దొడ్లోకి పరుగెత్తాడు వెంకాయి. వెంకాయిని చూచి గేదె 'బే' అని అడలింది.

యశోధరుడుఒక్క క్షణం తన్ను తాను నమ్మలేకుండా అలాగే నిల బడిపోయాడు. శూన్యం—శూన్యం శూన్యం—జేబులోనుంచి అచ్చుపుస్తకం తీశాడు. గబగబా పేజీలు తిరగవేశాడు. అప్రయత్నంగా ఈ వాక్యం అతని కంట బడింది. "ప్రజాస్వామిక విప్లవంలో వ్యవసాయకూలీలూ, రైతులూ కలిసి పోట్లాడాలి."

"ఇది ప్రజాస్వామిక విప్లవమా?" అనుకున్నాడు. అటూ ఇటూ చూశాడు. కాని అప్పటికే ఎవ్వరిదారిన వాళ్ళు వెళ్ళారు. వ్యవసాయకూలీలూ ఎవ్వరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళారు. బసవయ్య భార్యనీ కూతుర్నీ తీసుకొని ఇంట్లోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు.

యశోధరుడికి మిగిలింది శూన్యమే!